
భువనేశ్వర్‌లోని పూజా మండపంలో ప్రభాతి ప్రార్థన

సుభద్ర సొమ్ముకు ఢోకా లేదు

త్వరలో మూడోవిడత చెల్లింపులు: ప్రభాతి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: 'సుభద్ర' నగదు పంపిణీ కార్యక్రమం సెప్టెంబరు 17న ప్రధాని నరేంద్రమోదీ భువనేశ్వర్‌లో ప్రారంభించారు. తొలి విడతగా 25 లక్షల మంది మహిళల బ్యాంకు ఖాతాలకు రూ.5 వేలు చొప్పున పంపించారు. ఈ నెల 9న ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి బరిపదలో జరిగిన కార్యక్రమంలో 35 లక్షల మందికి రెండోవిడత సొమ్ము జమచేశారు. ఈ నేపథ్యంలో సెప్టెంబరు ప్రథమార్ధంలో సుభద్ర పథకం కోసం దరఖాస్తు చేసిన మహిళల్లో ఎంతోమందికి నగదు జమకాలేదు. దీనిపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కాల్ సెంటర్‌కు కొంతమంది ఫోన్‌లు చేస్తున్నారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడ శనివారం వివరణ ఇచ్చారు. ఆమె భువనేశ్వర్‌లో విలేకర్లతో మాట్లాడుతూ ఇంతవరకు రెండు విడతల్లో 60 లక్షల మంది ఖాతాల్లో నగదు జమ చేసినట్లు చెప్పారు. కోటి 11 వేల మంది దరఖాస్తుల రిజిస్ట్రేషన్ పూర్తయిందని, అర్హులందరికీ సొమ్ము అందుతుందని పునరుద్ఘాటించారు. తొలివిడత దరఖాస్తు చేసినవారిలో కొంతమందికి సొమ్ము అందని విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనికి కారణాలేమిటన్న దానిపై అధ్యయనం జరుగుతోందన్నారు. దరఖాస్తులు చేసిన తర్వాత సొమ్ము అందని వారికి ఫోన్ చేస్తారని, ఆలస్యానికి కారణం తెలియపర్చి, దరఖాస్తులు నింపడంలో పొరపాట్లు జరిగుంటే తెలియపరుస్తామన్నారు. ఆధార్‌తో ఫోన్‌నెంబరు లింకు కాని పక్షంలో సొమ్ము జమకాదన్నారు. ఇతరత్రా ఇబ్బందులుంటే సమితి సిబ్బంది, ఆయా ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి పరిశీలించి అందరికీ సొమ్ము అందేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి నిధుల కొరత లేదని, బడ్జెట్‌లో కేటాయింపు జరిగిందన్నారు. మూడోవిడత సొమ్ము పంపిణీ త్వరలో జరుగుతుందని, ఈ దిశగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సుభద్ర పథకం కింద మహిళలందరికీ న్యాయం జరుగుతుందని, ఎవరికీ ఎలాంటి అనుమానాలు ఉండొద్దని చెప్పారు. ఒకసారి లబ్ధిదారుల జాబితా సిద్ధమైతే మార్చి 8న ఒకేసారి చెల్లించగలుగుతామని ప్రభాతి తెలిపారు.

25 జిల్లాల్లో రుతుపవనాల నిష్క్రమణ

గోపాలపూర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ప్రారంభమైందని గోపాల్‌పూర్ వాతావరణ అధ్యయన కేంద్రం (ఐఎండీ) అధికారి కె.ఎస్.మూర్తి ఆదివారం సాయంత్రం 'న్యూస్‌టుడే'కు చెప్పారు. మయూర్‌భంజ్, కేంఝర్, బాలేశ్వర్, భద్రక్, జగత్సింగ్‌పూర్, పూరీ, కేంద్రపడ, కటక్, ఖుర్దా, జాజ్‌పూర్, నయాగఢ్, బౌద్ధ్, అనుగుల్, ఢెంకనాల్, దేవ్‌గఢ్, సోన్‌పూర్, బరగఢ్, సంబల్‌పూర్, ఝార్సుగుడ, సుందర్‌గఢ్, బొలంగీర్, కొంధమాల్, గంజాం, నువాపడ, కలహండి జిల్లాల్లో ఆదివారం రుతుపవనాలు వెనక్కి మళ్లాయన్నారు. మిగతా 5 జిల్లాల్లో 48 గంటల్లోగా నిష్క్రమించే సూచనలు ఉన్నాయన్నారు. రానున్న నాలుగు రోజుల వరకు రాష్ట్రంలో వాతావరణం పొడిగా ఉంటుందన్నారు.

నాలుగు రోజుల్లో సొరంగమార్గంపై నివేదిక

గోపాలపూర్, న్యూస్‌టుడే: పూరీ శ్రీక్షేత్రం రత్నభాండాగారంలో సొరంగ మార్గం ఉందా? మరిన్ని రహస్య గదులున్నాయా? అన్నదానిపై మరో నాలుగు రోజుల్లో స్పష్టత వస్తుందని న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ చెప్పారు. ఆదివారం సాయంత్రం పూరీలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ హైదరాబాద్‌కి చెందిన జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నిపుణులు ఇటీవల రత్న భాండాగారంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సర్వే చేసిన విషయం తెలిసిందేనన్నారు. నివేదిక అందిన తర్వాత రహస్య గదులు, గోప్య సంపద వివరాలపై స్పష్టత వస్తుందన్నారు. రహస్య గదులున్నట్లు తెలిస్తే ఏం చేయాలన్న దానిపై ప్రభుత్వం నిర్ణయిస్తుందన్నారు. ఏమీ లేకపోతే పురావస్తుశాఖ (ఏఎస్ఐ) భాండాగారం మరమ్మతులు చేపడుతుందన్నారు. ఈ పనులు ముగిసిన తరువాత స్ట్రాంగ్ రూంలో ఉంచిన ఆభరణాలను భాండాగారానికి తరలించి లెక్కింపు చేయిస్తామన్నారు. మార్గశిర మాసం నుంచి దర్శన వ్యవస్థ సులభతరమవుతుందని, భక్తులు 7 మెట్ల మార్గం మీదుగా గర్భగుడికి చేరుకునేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. లోపల తొక్కిసలాటకు తావీయకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు.

భక్తులకు ఉచితంగా ఒబడా

మంత్రి పృథ్వీరాజ్


పృథ్వీరాజ్ హరిచందన్

గోపాలపూర్, న్యూస్‌టుడే: పూరీ జగన్నాథుని దర్శనానికి వస్తున్న భక్తులందరికీ ఒబడా (మహాప్రసాదం) ఉచితంగా పంపిణీ చేయడానికి ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. ఆదివారం పూరీలో న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ విలేకర్లతో మాట్లాడుతూ స్వామి దర్శనం చేసుకున్న తరువాత భక్తులందరికీ మహా ప్రసాదం అందజేసేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. త్వరలో ఈ విధానం ప్రారంభం కానుందన్నారు. దీనికింద ఏడాదిలో రూ. 15 కోట్లు ఖర్చవుతుందన్న అంచనా ఉందన్నారు. ఈ మొత్తం దాతల నుంచి సేకరించాలన్న ధ్యేయంతో ఉన్నామని చెప్పారు. జగన్నాథుని కార్తిక సేవలు ప్రారంభం కానుండగా, ఇవి నిర్ణీత వేళల్లో జరిగేలా చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు.

ఆనందోత్సాహాలతో దసరా

నేడు దేవీ విగ్రహాల నిమజ్జనం


కటక్ రాణిహాట్ కూడలిలో ఆకట్టుకున్న దుర్గమ్మ

భువనేశ్వర్, న్యూస్‌టుడే: దేవీనవరాత్రి వేడుకలు ముగిశాయి. ఈ ఏడాదిలో ప్రజలు రెండు రోజులు దసరా పండగ జరుపుకోవడం విశేషం. దశమి తిథి శనివారం మధ్యాహ్నం ప్రారంభమై ఆదివారం వరకు కొనసాగడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. దేవీ పెండాళ్లలో మహానవమి పూజలు శనివారం జరిగాయి. ఈ నేపథ్యంలో కొందరు దసరా వేడుకలు ఆదివారం నిర్వహించుకున్నారు. ఆనవాయితీ ప్రకారం ఆయుధ పూజలు చేశారు. దుర్గమ్మలు కొలువుదీరిన పూజామండపాలు భక్తులతో కిటకిటలాడాయి. భువనేశ్వర్, కటక్ జంట నగరాల్లో రద్దీ నియంత్రణకు పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. మరోవైపు శక్తిపీఠాల్లో శరన్నవరాత్రుల పూజలకు శుక్రవారం అర్ధరాత్రి పూర్ణాహుతి జరిగింది. సోమవారం దేవీ విగ్రహాల నిమజ్జనాలు జరగనున్నాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కమిషనరేట్ పోలీసు యంత్రాంగం ఏర్పాట్లు చేపట్టింది.


పెండాళ్లలో ఆదివారం భక్తుల పూజలు

శ్రీక్షేత్రంలో ముగ్గురుమూర్తుల 'సున్నాభెషా'

గోపాలపూర్, న్యూస్‌టుడే: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని విశ్వప్రసిద్ధ పూరీ శ్రీక్షేత్రంలో ఆదివారం జగన్నాథ, బలభద్ర, సుభద్రలు రాజరాజేశ్వర (సున్నాభెషా) రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. గర్భగుడిలోని రత్న సింహాసనంపై ఈ వేడుక జరిగింది. సేవాయత్‌లు స్వర్ణాభరణాలు, ఆయుధాలతో పురుషోత్తముడ్ని రాజరాజేశ్వరునిగా అలంకరించారు. దీనికి ముందుగా స్వామికి ఇతర సేవలు జరిగాయి. సున్నాభెషా దర్శనానికి భక్తులు కిటకిటలాడారు. పోలీసు యంత్రాంగం ఆలయం లోపల, వెలుపల గట్టి బందోబస్తు చేసింది.

ఆలయం వెలుపల నాగార్జున రూపంలో విమల


రాజరాజేశ్వరునిగా పురుషోత్తముడు


బలభద్రుని వేడుక


దేవీ సుభద్ర శింగారం


నాగార్జునావతారంలో విమలమ్మ

దశమినాడు నాగార్జునిగా

శ్రీక్షేత్రంలో శరన్నవరాత్రుల వేడుకల్లో విమలమ్మకు షోడశోపచార సేవలు జరిగిన సంగతి తెలిసిందే. ఆలయం వెలుపల అమ్మ కకుడిఖియి రూపంలో భక్తులకు దర్శనమిచ్చింది. అమ్మ విజయదశమిని పురస్కరించుకుని నాగార్జున అవతారంలో అలరించింది. ఇందులో దుర్గామాధవ రూపాలు ఇమిడి ఉన్నాయంటారు సేవాయత్‌లు. సోమవారం ఏకాదశి నేపథ్యంలో శ్రీక్షేత్రంలో రాధా దామోదర సేవలు ప్రారంభం కానున్నాయి. దీంతో కార్తిక వ్రతధారుల (హబిషార్థులు) పూజలకు తెరలేస్తుంది.

నవీన్ కోటరీకి దూరమయ్యారా?

తాజా పరిస్థితులపై చర్చ

భువనేశ్వర్, న్యూస్‌టుడే

బిజద అధికారంలో ఉన్నపుడు నవీన్ నివాస్‌లో అధినేతను కలవాలంటే నేతలకు సాధ్యమయ్యేది కాదు. మాజీ సీఎం చుట్టూ ఉండే కొందరే రోజూ ఆయనను కలిసేవారు. ఎమ్మెల్యేలు, జిల్లాస్థాయి నేతలు ఆయనను కలవలేకపోయేవారు. దీంతో అసంతృప్తి క్రమంగా పెరుగుతూ వచ్చింది. పార్టీ అధికారం కోల్పోయిన తరువాత పరిస్థితి మారింది. ఇప్పుడు నవీన్ అందర్నీ కలిసే ప్రయత్నం చేస్తున్నారు. తన నివాసం తలుపులు అన్నివేళలా తెరిచే ఉంటాయని చెబుతున్నారు.


శంఖభవన్‌లో నేతలతో నవీన్

ఇదివరకు కొద్ది మందికే అవకాశం

నవీన్ ముఖ్యమంత్రిగా కొనసాగిన సమయంలో మంత్రులు, ఎంపీలు, శాసనసభ్యులకు నవీన్ నివాస్‌లోకి ప్రవేశం అరుదు. ఆయన అనుమతిస్తేనే వెళ్లగలిగేవారు. అప్పట్లో వి.కార్తికేయ పాండ్యన్, ప్రణవప్రకాష్‌దాస్ (బొబిదాస్), మానస్ మంగరాజ్ నవీన్ నివాస్‌లో చక్రం తిప్పేవారు. నేతలంతా ఈ ముగ్గుర్ని సంప్రదించేవారు. అధినేతకు నేరుగా ఏమీ చెప్పలేని పరిస్థితి ఉండేది. మంత్రులు స్వీయ నిర్ణయాలు తీసుకోలేకపోయేవారు. పాండ్యన్, బొబిదాస్ చెప్పిందే చేయాల్సి వచ్చేది. నవీన్ కోటరీపై ఎంతోమంది నేతలకు అప్పట్లో అసంతృప్తి ఉన్నా నిస్సహాయంగా ఉండిపోయారు.


వి.కార్తికేయ పాండ్యన్


బొబిదాస్


మానస్ మంగరాజ్

తీవ్ర అసంతృప్తి

ఎన్నికల్లో టిక్కెట్ల కేటాయింపు సక్రమంగా జరగలేదు. విజయావకాశాలున్నవారిని పక్కన పెట్టి పాండ్యన్, బొబిల విధేయులకు అవకాశమిచ్చారన్న అసంతృప్తి ప్రబలంగా ఉంది. బిజద పరాజయానికి ఈ పరిస్థితి కూడా కారణమని ఇప్పటికీ ఎంతోమంది అంటున్నారు. పార్టీ పరాజయం తరువాత నవీన్ నివాస్‌కు ఆయన విధేయులుగా మెలిగినవారు దూరమయ్యారు. అధినేత వారిని దూరంగా పెట్టారా? అసంతృప్తి చక్కదిద్దడానికి తాత్కాలికంగా రావద్దన్నారా? అన్నదానిపై స్పష్టత లేదు.

మూడేసి బృందాలు

ఈ నెల 2 నుంచి 6 వరకు బిజద జనసంపర్క యాత్రలు తొలివిడతగా జరిగాయి. కలిసిమెలసి జనాల్లోకి వెళ్లాలని అధినేత శ్రేణులకు సందేశమిచ్చారు. ఇది అమలు కాలేదు. అన్ని నియోజకవర్గాల్లో నేతలు వేర్వేరుగా కార్యక్రమాలు చేపట్టారు. రాజధాని భువనేశ్వర్‌లో నేతల మధ్య వివాదాలు రచ్చకెక్కాయి. ఇది నవీన్ దృష్టికొచ్చింది. రెండు గ్రూపుల వార్ని పిలిచి మాట్లాడారు.

సభ్యత్వ నమోదు ప్రారంభం

బిజద నేతల మధ్య సంఘీభావం లేని స్థితిలో బుధవారం నుంచి అధినేత సభ్యత్వ నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రెండు నెలల వ్యవధిలో కోటి మందిని సభ్యులుగా చేర్చుకోవాలన్నారు. మరోవైపు ఈ నెల 22 నుంచి 30 వరకు రెండోవిడత జనసంపర్కయాత్రలు ప్రారంభం కానున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకున్న నవీన్ అందర్నీ కలుపుకొని వెళ్లాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ ఉద్దేశంతో నవీన్ నివాస్ తలుపులు అందరికోసం తెరిచే ఉంటాయన్నారు. 25 ఏళ్లలో ఎన్నడూ దసరా పూజా మండపాలను సందర్శించని ఆయన శనివారం అక్కడి అమ్మవార్లను పూజించడం విశేషం.

నూతన జవసత్వాలు అవసరం

బిజదలోని సంఘాలన్నీ చురుగ్గా లేవు. సంస్థాగత ఎన్నికలు దీర్ఘకాలంగా జరగలేదు. జిల్లాల సంఘాల అధ్యక్షులు కొందరు నడవలేని స్థితిలో ఉన్నారు. ఈ నేపథ్యంలో పార్టీని బలోపేతం చేయడానికి అధినేత దృష్టి సారించి జవసత్వాలు సమకూర్చాల్సి ఉంది. విపక్షనేతగా నవీన్ తన వంతు విధులు సమర్థంగా నిర్వహించాల్సి ఉందని పరిశీలకులంటున్నారు.

పాండ్యన్ అజమాయిషీని ప్రజలు తిరస్కరించారు

అమర్ ప్రసాద్ శత్పథి



భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఎన్నికల సమయంలో తప్పు చేసిన నవీన్ పట్నాయక్ మరోసారి తప్పటడుగు వేయరాదని బిజద అగ్రనేత, మాజీ మంత్రి అమర్‌ప్రసాద్ శత్పథి అన్నారు. శనివారం జాజ్‌పూర్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తామంతా వి.కార్తికేయపాండ్యన్‌ను ఎప్పుడూ నేతగా పరిగణించలేదన్నారు. ఎన్నికల సమయంలో ఆయనకు ప్రచార బాధ్యతలప్పగించి నవీన్ పెద్ద తప్పు చేశారన్నారు. దీనిని ప్రజలు స్వీకరించలేదన్నారు. ఎన్నికల తరువాత ఎక్కడ లోపాలు జరిగాయన్న దానిపై అధినేత పూర్తిస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించలేదన్నారు. ఇకనైనా నవీన్ దృష్టి సారించాలన్నారు. మరోనేత సంబిత్‌రౌత్ పరదీప్‌లో ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ సీనియర్ నేత అమర్ చెప్పింది సత్యమన్నారు. ప్రస్తుతం నవీన్ నివాస్ తలుపులు అందరి కోసం తెరిచిన అధినేత జిల్లాలవారీగా సమీక్షిస్తున్నందున పార్టీలో నెలకొన్న అసంతృప్తి, అలకలు తొలగిపోతాయన్న ఆశాభావం ఉందన్నారు.

అమ్మా! దుర్గమ్మ!!


శ్రీ రేవణ సిద్ధేశ్వరస్వామి మందిరంలో అమ్మవారికి గాజులతో అలంకరణ

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపురలోని అమ్మవార్ల ఆలయాలు, వివిధ సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన దేవీ శరన్నవరాత్రోత్సవాలు శనివారం విజయదశమితో ముగిశాయి. మార్వాపేటలోని శ్రీ రామలింగ చౌడేశ్వరి అమ్మవారు, శ్రీ రేవణ సిద్ధేశ్వరస్వామి మందిరాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. గాంధీనగర లలిత గ్రూపు మహిళలు దుర్గాపూజ తాత్కాలిక మండపంలో సామూహిక పారాయణం నిర్వహించారు. నీలకంఠనగర్ హౌసింగు బోర్డులోని వేదమాత గాయత్రీదేవికి శాకాంబరి అవతారానికి ఉపయోగించిన వివిధ రకాల కాయగూరలతో కూరలు వండి ఆదివారం మధ్యాహ్నం వందలాది మందికి అన్నప్రసాదాలు ఏర్పాటు చేశారు. తెలుగు బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు పూడిపెద్ది సత్యనారాయ (బాబు), గాయత్రీమాత మందిరం పూజా కమిటీ ఛైర్మన్ శ్రీపాద రామ్‌కుమార్ పర్యవేక్షించారు.

మహాసరస్వతిగా కటక్ చండీ

భువనేశ్వర్, న్యూస్‌టుడే: కటక్ చండీ ఆలయంలో శరన్నవరాత్రులు ముగిశాయి. విజయదశమిని పురస్కరించుకుని శనివారం అమ్మ శాంత స్వరూపిణిగా మహాసరస్వతి రూపంలో భక్తులకు దర్శనమిచ్చింది. మజ్జిగన్నం అర్పించిన ఆలయ యంత్రాంగం భక్తులందరికీ ఆ ప్రసాదాన్ని ఉచితంగా అందించింది.


మహా సరస్వతిగా కటక్ చండీ

పశ్చిమ ఒడిశాలో రావణ దహనం వేడుకలు


సంబల్‌పూర్‌లో రామలక్ష్మణ వేషధారులతో కలిసి ధర్మేంద్ర పూజలు


రవుర్కెలా సెక్టార్-12లో రావణ దహనం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రావణ, కుంభకర్ణుల రూపాల్లోని దుష్టశక్తుల సంహారం వేడుకను శని, ఆదివారాల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించారు. రవుర్కెలా, సంబల్‌పూర్ నగరాలు, ఇతర పట్టణాల్లో శనివారం రాత్రి రావణ దహనం వేడుకలు జరిగాయి. ఉత్తరకోస్తా తీర జిల్లాల్లో ఈ ఉత్సవం ఆదివారం రాత్రి చేపట్టారు.

సంబల్‌పూర్ వేడుకల్లో ధర్మేంద్ర

సంబల్‌పూర్‌లో జరిగిన రావణ దహనం వేడుకల్లో కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పాల్గొన్నారు. శ్రీరామ, లక్ష్మణ వేషధారులతో ముచ్చటించారు. దీనికి ముందుగా పూజా మండపాల్లో దుర్గమ్మ సన్నిధిలో పూజలు చేశారు.

రవుర్కెలాలో ప్రమాదం

ఘటనలో యువకునికి తీవ్రగాయాలు


కాలిన గాయాలతో యువకుడు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాల్లో భాగంగా పలుచోట్ల రావణ దహనకాండ (రావణ పోడి) జరిగింది. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఓ యువకునికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రవుర్కెలాలో సెక్టార్-13లోని మేలన మైదానంలో రావణ దిష్టి బొమ్మకు నిప్పంటించారు. ఈ దృశ్యాన్ని చూసేందుకు వేలాది మంది భక్తులు హాజరయ్యారు. కలుంగా ప్రాంతానికి చెందిన రాకేష్ అనే యువకునికి టపాసులు తగిలి తీవ్ర గాయాలయ్యాయి. వాటిలో కొన్ని నేరుగా రాకేష్ ఛాతీకి తగిలి కొంత మేర కాలింది. స్థానికుల సహకారంతో అగ్నిమాపక సిబ్బంది ఆయనను కాపాడి ఆసుపత్రికి తరలించారు.

55 అడుగుల దశకంఠుని బొమ్మ


దిష్టిబొమ్మ దహనం

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రావణ దహన కార్యక్రమం ఘనంగా జరిగింది. కొత్తకోళీ ఆజాద్ బాయ్స్ క్లబ్ వందో సంవత్సరం సందర్భంగా రావణమైదానంలో 55 అడుగుల దశకంఠుడు, 30 అడుగుల ఎత్తు కుంభకర్ణుడు, మేఘనాథుడు దిష్టిబొమ్మలను దహనం చేశారు. వేలాదిమంది ప్రేక్షకులు హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా మిడ్నాపూర్ లోక్‌సభ సభ్యురాలు, జూన్‌మాలియా, ఎస్పీ ధృతిమాన్ సర్కార్, మిడ్నాపూర్ ఎమ్మెల్యే దినేష్‌రాయ్ పాల్గొన్నారు. సాముగారిడీ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. దసరా ఉత్సవ కమిటీ ప్రముఖుడు ప్రదీప్‌సర్కార్, సంఘం సభ్యులు హాజరయ్యారు.

మండపాల్లో నవీన్ పూజలు

25 ఏళ్లు ఎందుకు ముఖం చాటేశారన్న భాజపా


భువనేశ్వర్‌లోని ఒక పూజా మండపంలో నవీన్ పూజ

భువనేశ్వర్, న్యూస్‌టుడే: బిజద అధినేత నవీన్‌పట్నాయక్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో దసరా వేడుకల్లో ఎన్నడూ పాల్గొనలేదు. 25 వసంతాల పాలనా కాలంలో ఒక్కసారైనా పూజామండపాలను సందర్శించిన దాఖలాలు లేవు. అధికారం కోల్పోయిన తర్వాత వచ్చిన మొదటి దసరా ఉత్సవాల్లో ఏర్పాటు చేసిన దేవీ పెండాళ్లను ఆయన సందర్శించి అమ్మవార్లను పూజించారు. శుక్ర, శనివారాల్లో భువనేశ్వర్‌లోని వివిధ మండపాలకు వెళ్లారు. దుర్గమ్మల సన్నిధిలో పూజలు చేశారు. ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి సతీ సమేతంగా దసరా వేడుకల్లో పాల్గొనడం గమనించిన నవీన్ తానూ పాల్గొంటున్నారని భాజపా నాయకులంటున్నారు. ప్రజాపనులు, న్యాయశాఖల మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ శనివారం భువనేశ్వర్‌లో విలేకర్లతో మాట్లాడుతూ తాను జనాదరణ గల నేతనని సీఎంగా ఉన్న సమయంలో భావించిన నవీన్ ఎన్నడూ ఏ వేడుకలోనూ పాల్గొనలేదన్నారు. ముఖ్యమంత్రి మోహన్ యువకుడు, ప్రజలు మనిషి కావడంతో అన్నింటా ముందుంటున్నారన్నారు. ఆయనతో పోటీపడి ఇప్పుడు లేని ఓపిక కూడగట్టుకుని నవీన్ కార్యక్రమాల్లో పాల్గొనడం వెనక రాజకీయ ఉద్దేశం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. మరోవైపు విపక్ష ఉపనేత ప్రసన్న ఆచార్య శనివారం సంబల్‌పూర్‌లో విలేకర్లతో మాట్లాడుతూ ఎంతోమంది ప్రజలు నేటికీ నవీన్ తమ ముఖ్యమంత్రి అంటున్నారని, జనాదరణలో ఆయనే అగ్రగామి అని పేర్కొన్నారు.

కటక్‌ను స్మార్ట్‌సిటీగా తీర్చిదిద్దుతాం

సన్నాహాలు ప్రారంభిస్తామన్న మోహన్


పూజా మండపంలో సీఎం దంపతుల దాండియా వేడుక

భువనేశ్వర్, న్యూస్‌టుడే: పురాతనమైన కటక్ నగరానికి వెయ్యేళ్ల చరిత్ర ఉంది. ఒకవైపు మహానది, మరోవైపు కఠజోడి ప్రవహిస్తున్న ఈ చారిత్రక నగరం మాస్టర్ ప్లాన్ ప్రకారం రూపుదిద్దుకోలేదు. డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉండడంతో చినుకు పడితే చిత్తడిగా మారుతోంది. దీన్ని చక్కదిద్దడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితమివ్వలేదు. ఈ నేపథ్యంలో శనివారం కటక్‌లో దేవీ పూజల మండపాలను సతీసమేతంగా సందర్శించిన ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి ఆయా చోట్ల పూజలు చేశారు. అనంతరం ఉన్నతాధికారులతో పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ భువనేశ్వర్, రవుర్కెలా మాదిరిగా కటక్ నగరాన్ని స్మార్ట్‌సిటీగా తీర్చిదిద్దడానికి గట్టి ప్రయత్నాలు చేస్తామన్నారు. సమగ్ర కార్యాచరణ ప్రణాళిక అమలు పరుస్తున్నామని, డబుల్ ఇంజిన్ పాలనలో లక్ష్యసాధన తథ్యమన్నారు. కటక్ వేడుకల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి చవులియాగంజ్ పూజా మండపం ఆవరణలో భార్యతో కలసి దాండియా ఆడారు.

కేంఝర్ సందర్శన

ఆదివారం మోహన్ తన సొంత జిల్లా కేంఝర్ వెళ్లారు. వివిధచోట్ల ఏర్పాటైన పూజామండపాలను తిలకించారు. ఆత్మీయులతో ఆనందం పంచుకున్నారు. ఖనిజ సంపదల నిధి (డీఎంఎఫ్)తో మాస్టర్ ప్లాన్ ప్రకారం పనులు చేయిస్తామన్నారు. జిల్లా యువతీ యువకులకు ఉపాధి కల్పనకు ప్రాధాన్యమిస్తామన్నారు.

స్ట్రెచ్చర్‌లో గర్భిణి తరలింపు



గర్భిణిని స్ట్రెచ్చర్‌లో మోసుకెళ్లిన కుటుంబసభ్యులు

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: ఓ గర్భిణిను స్ట్రెచ్చర్‌లో రెండు కిలోమీటర్ల మోసుకెళ్లిన ఘటన మల్కాన్‌గిరి చిత్రకొండ సమితిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే ఆదివారం ఉదయం చిత్రకొండ సమితి బడపదర్ పంచాయతీ సమరాంగిని గ్రామానికి చెందిన శాంతమ్మ ఖోర అనే గర్భిణికి ప్రసవ నొప్పులు వచ్చాయి. భర్త అదుఖోల వెంటనే అంబులెన్స్‌ను సంప్రదించగా రోడ్డు సదుపాయం లేకపోవడంతో గ్రామానికి రెండు కిలోమీటర్లు దూరంలో ఆగిపోయింది. వాహన చోదకుడు సహాయంతో భర్త, కుటుంబసభ్యులు కలిసి ఆమెను గ్రామం నుంచి స్ట్రెచ్చర్‌లో మోసుకొని అంబులెన్స్‌లో ఎక్కించారు. అనంతరం చిత్రకొండ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ ఆమె ఓ మగబిడ్డను ప్రసవించినట్లు, తల్లీబిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

విద్యార్థులు గుర్తింపు తెచ్చుకోవాలి

సిమిలిగుడ, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో ఉన్న ప్రతిభతో గుర్తింపు తెచ్చుకోవాలని లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత అన్నారు. శనివారం జరిగిన సమితి స్థాయి సురభి సాంస్కృతిక పోటీలకు ముఖ్య అతిథిగా ఆమె పాల్గొన్నారు. విద్యాధికారి నర్సింగ్‌నాథ్ పండా, సమితి అధ్యక్షురాలు సుహికూల్ సెకా, ఎంపీ ప్రతినిధి కైలాస్‌కోసల తదితరులు ఉన్నారు. ఈ పోటీల్లో విజేతలకు రాత్రి జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో బహుమతులు అందజేశారు. ప్రథమ, ద్వితీయ స్థానం దక్కించుకున్న వారు రాష్ట్రస్థాయికి అర్హత సాధించినట్లు నిర్వాహకులు చెప్పారు.



బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే పవిత్ర

నిరుపయోగంగా అటవీశాఖ భవనాలు



ఇవే ఆ భవనాలు

జయపురం, న్యూస్‌టుడే: జయపురం పట్టణం జయనగర్ ప్రాంతంలోని అటవీశాఖ ఉద్యోగులు నివాసం ఉండేందుకు ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. నిర్వహణ లోపించడంతో నాలుగేళ్లుగా ఉద్యోగులు నివసించడం లేదు. దీంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. కొందరు దుండగులు భవనంలో ఇనుప తలుపులు, ఇతరత్ర సామగ్రి దొంగలిస్తున్నారు. ఈ విషయమై 'న్యూస్‌టుడే' రేంజర్ సచిదానంద్ పరిడాను అడగ్గా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.

డెంగీ వ్యాపించకుండా అప్రమత్తం

సిమిలిగుడ, న్యూస్‌టుడే: సునాబెడ పురపాలక సంస్థ పరిధిలో డీపీ క్యాంపులో గత కొద్దిరోజులుగా డెంగీ వ్యాప్తి చెందుతోంది. ఇక్కడ సుమారు 15 మందికి వ్యాధి సోకగా, ఇద్దరు మృతి చెందారు. దీంతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఆదేశాల మేరకు సునాబెడ ప్రభుత్వం ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం డీపీ క్యాంప్ ప్రాథమిక పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు ప్రజలకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. వ్యాధి నివారణకు సంబంధించిన కరపత్రాలు అందించి తగు సూచనలు చేశారు. కౌన్సిలర్ రవీంద్రకుమార్ ప్రధాన్ నేతృత్వంలో డెంగీ చైతన్య కార్యక్రమం జోరుగా సాగుతోంది.



పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరం

బ్రహ్మపురలో ధర్నా



గాంధనగర్ కూడలిలోని మహాత్ముని విగ్రహం వద్ద ధర్నాలో పాల్గొన్న ప్రఫుల్ల సామంత్రాయ్, సుధీర్ రౌత్ తదితరులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: లద్దాక్‌లో పర్యావరణ పరిరక్షణపై సోనమ్ వాంగ్‌చుక్ దిల్లీలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారు. ఆయనకు మద్దతుగా లోక్ శక్తి అభియాన్, ఆర్యభట్ట ఫౌండేషన్‌లు ఆదివారం బ్రహ్మపురలో మౌన ధర్నా నిర్వహించాయి. ఉదయం మూడు గంటలపాటు గాంధీనగర్ కూడలిలోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద ఆయా సంస్థల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు ధర్నా చేపట్టారు. ప్రముఖ పర్యావరణవేత్త ప్రఫుల్ల సామంత్రాయ్, ప్రకృతి ప్రేమికుడు సుధీర్ రౌత్ నాయకత్వంలో జరిగిన ధర్నాలో బాలచంద్ర షడంగి, కె.నందేశు సేనాపతి, సుభాష్ రౌత్, బిజయ బెహర, ఆదిత్య రథ్ తదితరులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో సురేష్‌కుమార్‌కు పతకాలు



రజత, కాంస్యపతకాలతో సురేష్‌కుమార్ యాదవ్

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: హిమాచల్‌ప్రదేశ్‌లో జరుగుతున్న జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రాష్ట్రానికి చెందిన సురేష్ కుమార్ యాదవ్ రెండు పతకాలు దక్కించుకున్నారు. ఒడిశా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి కె.రవికుమార్ ఆదివారం 'న్యూస్‌టుడే'కు ఆ వివరాలు వెల్లడించారు. పోటీల్లో శనివారం 96 కిలోల శరీరబరువు సీనియర్ విభాగంలో సురేష్‌కుమార్ యాదవ్ స్నాచ్‌లో 136 కిలోలు, క్లీన్‌జర్క్‌లో 178 కిలోలు బరువులెత్తి ఒక రజతం, ఒక కాంస్య పతకం గెలుచుకున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే ఈ పోటీల్లో రాష్ట్ర లిఫ్టర్లు యువ, జూనియర్, సీనియర్ విభాగాల్లో 7 పసిడి, 8 రజత, 3 కాంస్యపతకాలు సాధించారని రవికుమార్ హర్షం వ్యక్తం చేశారు. మరో ఇద్దరు లిఫ్టర్లు పోటీల్లో ఉన్నారని ఆయన పేర్కొన్నారు.

రమేష్‌పాఢికి అంతర్జాతీయ రిఫరీ అర్హత



రమేష్‌పాఢికి రిఫరీ గుర్తింపు కార్డు అందజేస్తున్న సహదేవ్

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: బ్రహ్మపురకి చెందిన కోచ్, జాతీయ రిఫరీ రమేష్ పాఢి వెయిట్ లిఫ్టింగ్‌లో అంతర్జాతీయ రిఫరీగా అర్హత పొందారు. ఈమేరకు ఆయన ఆదివారం 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ హిమాచల్‌ప్రదేశ్‌లో జరుగుతున్న జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ పోటీలకు రిఫరీగా వ్యవహరిస్తున్న తాను అంతర్జాతీయ రిఫరీ పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించానన్నారు. దీంతో తనకు భారత వెయిట్‌లిఫ్టింగ్ సంఘం అధ్యక్షుడు సహదేవ్ అంతర్జాతీయ రిఫరీ గుర్తింపు కార్డు అందజేశారని చెప్పారు.

దసరా తెచ్చిన సరదా..



సింధూర్ ఖేలాలో మహిళలు





కళాకారుల నృత్యప్రదర్శన

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: బెంగాలీలు దుర్గమ్మను తమ ఇంటి ఆడపడుచుగా భావిస్తారు. విజయదశమి రాత్రి పూజా మండపాల్లో దుర్గమ్మకు సింధూరం రాసి, మిఠాయిలు తినిపించి తమ ఇంటి ఆడపడుచును కన్నీటితో సాగనంపుతారు. వచ్చే ఏడాది నీ రాకకు ఎదురు చూస్తూ ఉంటామన్నారు.

సిమిలిగుడ, న్యూస్‌టుడే: సిమిలిగుడకు చెందిన శివశక్తి వాణిజ్య సంఘం ఆధ్వర్యంలో దుర్గాపూజలు శుక్ర, శనివారాలు ఘనంగా జరిగాయి. తొలి రోజు కార్యక్రమాన్ని సునాబెడ పురపాలక సంస్థ అధ్యక్షుడు రాజేంద్రకుమార్ పాత్రో ప్రారంభించారు. స్థానిక గాయకులు ఆర్కెస్ట్రా నిర్వహించారు. కళాకారుల నృత్య ప్రదర్శన అలరించింది. ఎమ్మెల్యే రఘురామ్ పడాల్ పాల్గొన్నారు.

సిమిలిగుడ, న్యూస్‌టుడే: సునాబెడ, దమన్‌జోడి ప్రాంతాల్లో శని, ఆదివారాలు దసరా వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి దీపధూప నైవేద్యాలు సమర్పించి పూజలు చేశారు. కుందిలి సంతలో మాజీ ఎంపీ జయరామ్ పంగి ఆధ్వర్యంలో 32వ దుర్గాపూజలు వైభవంగా నిర్వహించారు. పొట్టంగి ఎమ్మెల్యే రామచంద్రకదమ్ పాల్గొన్నారు. భక్తుల తాకిడితో మండపాలు వద్ద రద్దీ నెలకొంది.

రాయగడ, న్యూస్‌టుడే: రాయగడలో విజయదశమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రజల ఆరాధ్య దేవత మజ్జిగౌరి అమ్మవారిని శనివారం ప్రత్యేకంగా అలంకరించారు. వేల సంఖ్యలో భక్తులు, భవానీమాలదారులు దర్శించుకున్నారు. హోమం పూరనాహుతులు, జమ్మిచెట్టు పూజలు, వాహన, ఆయుధ పూజలు జరిగాయి.



రాయగడలో జమ్మి చెట్టుకు పూజలు



కుందిలి పూజా మండపం వద్ద ఎమ్మెల్యే కడమ్



మైదానంలో ఏర్పాటు చేసిన రావణుడి దిష్టిబొమ్మ

దశకంఠుడి దహనం

జయపురం, న్యూస్‌టుడే: జయపురం దసరా పొడియా మైదానంలో రావణ దహనం శనివారం రాత్రి వైభవంగా జరిగింది. తమలో ఉన్న చెడును మంటల్లో వేసి కాల్చాలని సూచిస్తూ స్థానిక దేవదాసుల ప్రతి ఏడాది ఈ కార్యక్రమం నిర్వహిస్తోంది. డీజీ నితీశ్వర్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. వేల సంఖ్యలో చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు చూసేందుకు వచ్చారు.

రూపుదిద్దుకుంటున్న ప్రతిమ



విగ్రహం తయారుచేస్తున్న కళాకారుడు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: రెండు రోజుల్లో ప్రారంభం కానున్న నందన్న ఉత్సవాలకు విగ్రహాల తయారీ జోరుగా కొనసాగుతోంది. పట్టణంలోని కటికవీధిలో నివాసముంటున్న కళాకారులు విగ్రహాలు చేసే పనిలో నిమగ్నమయ్యారు. వీటిని కొనుగోలు చేసేందుకు పర్లాఖెముండితో పాటు చుట్టుపక్కల గ్రామాలు, సరిహద్దు ప్రాంతమైన ఆంధ్రా నుంచి వస్తున్నారని కళాకారులు తెలిపారు.

ఘనంగా లాఠీ పూజలు

కొరాపుట్, న్యూస్‌టుడే: కొరాపుట్ శబరి శ్రీక్షేత్ర ప్రాంగణంలో శనివారం గిరిజన సంప్రదాయ పూజలతో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. జిల్లా పరిధిలో 100 గిరిజన గ్రామాల ప్రజలు గ్రామదేవతల ప్రతిరూపాలైన పలువ ఐదే పొడవాటి వెదురుకర్రల(లాఠీల)ను సంప్రదాయ బాజాభజంత్రీలతో ఊరేగింపుగా శబరి శ్రీక్షేత్రానికి తీసుకెళ్లారు. అనంతరం గురుమాయి(వృద్ధులు) స్థానిక శక్తిపీఠం వద్ద ప్రత్యేక పూజలు చేసి వెదురుకర్రలకు ప్రాణప్రతిష్ఠ చేసి గ్రామాల్లో ఊరేగించారు. దీంతో లాఠీ క్రతువులు ముగిశాయి.



గ్రామదేవతల ప్రతిరూపాలుగా పూజింపబడుతున్న లాఠీలు

జయపురం, న్యూస్‌టుడే: జయపురం పట్టణం రాజా విక్రమ్‌దేవ్ మహారాజు భవనంలో సంప్రదాయ పద్ధతిలో లాఠీపూజలు జరిగాయి. భవనంలో కనకదుర్గ ఆలయంలో పురాతన పద్ధతిలో దూరప్రాంతాల నుంచి వివిధ అమ్మవార్ల స్వరూపమైన లాఠీలను అర్చకులు కాలికడకన తీసుకువచ్చారు. వీటిని ఇక్కడ పూజలు చేయడం ఆచారం. దేవీ నవరాత్రులు సందర్భంగా అర్చకులు దాదాపు 150 కిలోమీటర్లు నడుచుకుని తీసుకువచ్చారు. నవరంగపూర్, కొరాపుట్, రాయగడ, మల్కాన్‌గిరి జిల్లాల నుంచి దాదాపు 200కి పైగా లాఠీలు తెచ్చినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.



పూజలు చేస్తున్న భక్తులు

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

సిమిలిగుడ, న్యూస్‌టుడే: పొట్టంగి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే రామచంద్రకదమ్ అన్నారు. సమితిలోని పెట్రూ పంచాయతీలో శనివారం రాత్రి, ఆదివారం పుకిలి, సిమిలిగుడ సమితి, సువాయి పంచాయతీల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులు పరిశీలించారు. ప్రజల ఇబ్బందులు తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు అందరికీ అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. పండగ వేళ ఎమ్మెల్యే ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. గిరిజనులతో కలసి నృత్యాలు చేశారు.



పెట్రూలో ప్రజలతో ఎమ్మెల్యే కదమ్

సందడిగా దుర్గాదేవి పూజలు



పర్లాఖెముండి విద్యుత్తు కార్యాలయంలో ...

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: మల్కాన్‌గిరి పట్టణంలో దుర్గాపూజ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. పట్టణంలో 15 చోట్ల దుర్గాదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించి నవరాత్రుల వేడుకలు నిర్వహించారు.



రిజర్వు పోలీసుల తరఫున దుర్గాపూజ



కనకదుర్గ ఆలయంలో నిర్వహిస్తున్న అపరాజిత పూజలు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గజపతి జిల్లాలో రెండు రోజులు విజయదశమి పూజలు ఘనంగా జరిగాయి. మండపాల వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జయపురం, న్యూస్‌టుడే: జయపురం పట్టణంలో శనివారం రాత్రి ఉత్సాహంగా దసరా ఉత్సవాలు జరిగాయి. మహారాజు విక్రమ్‌దేవ్‌రాజు దసరా పూజలు నిర్వహించిన పద్ధతిని నేటికీ ఆచరిస్తున్నారు. మొదట భగవతి అమ్మవారు పూర్ణగూడలోని దక్షిణకాళీ ఆలయానికి వెళ్లి చెల్లెళ్లను ఉత్సవాలకు ఆహ్వానిస్తారు. అనంతరం బసంతి, కనకదుర్గ ఆలయాల్లో అమ్మవారిని తమతో తీసుకొస్తారు. నలుగురు అక్కాచెల్లెళ్లను రాత్రంతా పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఊరేగిస్తారు. ఉత్సవం ముగిసిన తరువాత కనకదుర్గ ఆలయంలో అపరాజిత పూజలు చేసి అమ్మవార్లు తమ తమ ఆలయాలకు తిరిగి వెళ్లిపోతారు. ఈ ఉత్సవాన్ని చూసేందుకు వేలాది మంది ప్రజలు పాల్గొన్నారు.

మందిర నిర్మాణానికి విరాళం

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పట్టణంలో రాజా వీధి ప్రాంతంలో జగన్నాథ మందిర నిర్మాణానికి పలువురు దాతాలు విరాళాలు అందించారు. ఈ నేపథ్యంలో భువనేశ్వర్‌కు చెందిన కె కాంతాజెనా పర్లాఖెముండి పట్టణంలో నివసిస్తున్న పూర్ణచంద్ర పట్నాయక్ బంధువు ద్వారా రూ. లక్ష ఇరవై ఒక్కవేలు చెక్కును శనివారం రాత్రి ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ నిర్మాణ భక్తుడు దుర్గామాధవ్ పాణిగ్రహి తదితరులు పాల్గొన్నారు.



ఆలయ కమిటీ సభ్యులకు చెక్కును అందజేస్తున్న పూర్ణచంద్ర పట్నాయక్

బ్రహ్మపురలో నేత్రదానం



సేకరించిన కార్నియాలను వైద్యులకు అందజేస్తున్న నేత్రదాత కుటుంబ సభ్యులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపురలోని సోమనాథనగర్ రెండో లైనుకు చెందిన టి.సుభాష్ చంద్ర పాత్ర్ (81) అనే వృద్ధుడు ఆదివారం వేకువన ఇంట్లో కన్నుమూశారు. ఆయన నేత్రాలు దానం చేసేందుకు పాత్ర్ కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. దీనిపై వారు స్థానిక ఫ్రెండ్స్ హెల్పింగ్ క్లబ్ ప్రతినిధులకు తెలియజేశారు. వారి సమాచారంతో ఎమ్కేసీజీ వైద్య కళాశాల ఆసుపత్రి నేత్ర విభాగం వైద్యులు వివేకానంద సాహు, కిరణ్ రౌత్ సోమనాథనగర్‌లోని ఇంటికి చేరుకుని మృతుడి పాత్ర్ కార్నియాలు సేకరించారు. వాటిని నేత్రదాత కుటుంబ సభ్యులు వైద్యుల ద్వారా ఎమ్కేసీజీ నేత్రబ్యాంకుకు అందజేశారు. నేత్రదానం సమయంలో పాత్రో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, క్లబ్ ప్రతినిధులున్నారు.

ఈ వన్యప్రాణి ఎలా మృతి చెందింది?



పంట పొలంలో ఏనుగు కళేబరం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: బౌద్ధ్ జిల్లా అరమల్లిక్ అటవీ రేంజ్ పరిధిలోని మాధపూర్ గ్రామం పంట పొలంలో ఏనుగు కళేబరం కనిపించింది. దీన్ని చూసిన గ్రామ రైతులు అటవీశాఖ అధికారులకు తెలియపరిచారు. ఘటనా స్థలానికి వచ్చిన సిబ్బంది మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పంపించారు. ఈ వన్యప్రాణి ఎలా మృతి చెందిందన్న దానిపై దర్యాప్తు ప్రారంభించారు.

రతన్‌టాటా మార్గదర్శకుడు

రాయగడ, న్యూస్‌టుడే: పారిశ్రామికదిగ్గజం, మహాదాత, మానవతావాది రతన్‌టాటా మరణం తీరని లోటని, ఎందరికో ఆయన మార్గదర్శకులని స్పందన సాహితీ సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు గుడ్ల గౌరీశంకర్ ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక కవులు స్వీయ రచనలు వినిపించారు. కార్యదర్శి డా. పతివాడ తులసీదాస్, సాంస్కృతిక కార్యదర్శి కొండవలస కృష్ణమూర్తి పాల్గొని వచ్చే నెలలో సంస్థ వార్షికోత్సవాలు నిర్వహిస్తామని చెప్పారు. డా. బాబూరావు మహంతి, భళ్లమూడి వెంకట నాగేశ్వరరావు, విశ్రాంత అధ్యాపకులు గిరీష్‌పట్నాయక్, ఎల్.శివకేశవరావు, రచయిత్రి తాళ్లపూడి గౌరి, కొల్లూరు గౌరీప్రసాద్ తదితరులు రతన్‌టాటా మృతికి నివాళులర్పించారు.

ఇదేనా... సమగ్ర శిశు వికాస్!

గర్భిణులు, శిశువుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సమగ్ర శిశు వికాస్ పథకం వెనుకబడిన కొరాపుట్ జిల్లాలో తూతూమంత్రంగా సాగుతోంది. అధికారుల నిర్లక్ష్యంతో కాగితాలకే పరిమితం అవుతోంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో శిశువులు, గర్భిణులకు పౌష్టికాహారం అందించేందుకు దీన్ని ప్రారంభించినా ఫలితం లేదు. పౌష్టికాహారం నాణ్యత లోపించడంతో నల్లబజారుకు తరలిస్తున్నారు. కొన్ని కేంద్రాలు నెలల తరబడి తెరుచుకోవడం లేదు.

సిమిలిగుడ, న్యూస్‌టుడే



జేరైట్‌పుట్‌లో కార్యకర్త ఇంటి ముందు భోజనాలు చేస్తున్న పిల్లలు (పాతచిత్రం)

జిల్లాలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు 51 శాతం సొంత భవనాలు లేవు. వీటిలో 65 శాతం కేంద్రాలకు నీటి సౌకర్యం కల్పించ లేదు. కొరాపుట్ జిల్లాలో బిందురాణ సమితిలో 60 అంగన్వాడీ కేంద్రాలకు గానూ 16 కేంద్రాలకు సొంత భవనాలు లేకపోగా 44 కేంద్రాలు పాఠశాలల్లో, కార్యకర్త ఇళ్లల్లో నడుస్తున్నాయి. మరికొన్ని ఏడు కేంద్రాలకు నీటి సమస్య ఉంది. అలాగే బొపరిగుడ సమితిలో 90 కేంద్రాలకుగానూ 36 వాటికి భవనాలు లేవు. 4 కేంద్రాలను నీటి కొరత ఉంది. వాటి వివరాలు క్రమంగా పరిశీలిస్తే బొరిగుమ్మల్లో109 అంగన్‌వాడీ కేంద్రాలకు 34 కేంద్రాలకు భవనాలు లేవు. ఇందులో 18 భవనాలకు నీటి కొరత ఉంది. దశమంత్ పూర్ సమితిలో 87 కేంద్రాల్లోకు గానూ 43 కేంద్రాలకు భవనాలు కొరత, బయపురం సమితిలో 65 కేంద్రాల్లో 54 కేంద్రాలుకు సొంత భవనాలు లేకపోగా, కొరాపుట్‌లో 40కు గాను 14, కొట్పాడ్‌లో 66కు గాను 16, లక్ష్మీపూర్లో 47కు గాను 26, నందపూర్ లో 73 గాను 38, నారాయణపట్నంలో 55 గాను 17, పొట్టంగిలో 55గాను 33, సిమిలిగుడ సమితిలో 51 కేంద్రాల్లో 11 కేంద్రాలుకు సొంత భవనాలు లేక ఇబ్బందులు తప్పడం లేదు.

భవనాల సంఖ్య..

మొత్తం 918 కేంద్రాలుండగా 306 కేంద్రాలకు మంచినీటి సమస్య పీడిస్తోంది. భవనాల కొరత కారణంగా చెట్లు కింద, పాఠశాలల్లో వీటిని నిర్వహిస్తున్నారు. 30 శాతం భవనాలు శిథిలమయ్యాయి. అయినప్పటికీ బిక్కుబిక్కుమంటూ కార్యకర్తలు విధులు నిర్వహిస్తున్నారు. సమగ్ర శిశు వికాస్ పథకం అమలు తీరు పలు విమర్శలకు దారితీస్తున్నా ఉన్నతాధికార్లు పట్టించుకోవడం లేదు. భవనాలు కొరత విషయంపై సిమిలిగుడ సీడీపీ వినోదిని బెహరా ప్రశ్నించగా కొత్త భవనాల నిర్మాణాలకు నిధులు లేవని ప్రభుత్వానికి నివేదికను అందజేసినా లాభం లేదని అన్నారు. ఈ విషయంపై సబ్‌కలెక్టర్ వేణుధర్ సబర్‌ను ప్రశ్నించగా అంగన్‌వాడీ కేంద్రాల సమస్య అన్నిచోట్ల ఉందన్నారు. వీటిని నీతి అయోగ్ ఆధ్వర్యంలో కొన్ని స్వచ్ఛంద సంస్థల ద్వారా మొదటి దశలో కొరాపుట్ జిల్లాలోని సిమిలిగుడ, కొరాపుట్ సమితుల్లో ఐదు అంగన్‌వాడీ కేంద్రాలను ప్రయోగాత్మకంగా నిర్మాణం చేస్తారన్నారు. రానున్న రోజుల్లో అన్ని సమితుల్లో 100 అంగన్‌వాడీ కేంద్రాలు అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ఈ సమస్య ఉండకపోవచ్చు అని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.



పాత్ర బాగ్రి కేంద్రం దుస్థితి

అత్యాచారం కేసులో ఇద్దరి అరెస్టు



నిరంజన్ (పాతచిత్రం)



తులారామ్ (పాతచిత్రం)

జయపురం, న్యూస్‌టుడే: కిశోర బాలికలను అపహరించి, అత్యాచారం చేసిన కేసులో నిందితులను జయపురం మహిళా ఠాణా పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఎస్‌డీపీఓ అంకిత్‌వర్మ తెలిపిన వివరాలు ప్రకారం ..2022లో బొయిపరిగుడ సమితి రామగిరి పంచాయతీ మాఝిగూడ గ్రామానికి చెందిన నిరంజన్ దొళాయి(22) 15ఏళ్ల కిశోర బాలికను అపహరించి ఆమెపై అత్యాచారం చేశాడు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిరంజన్ పరారీలో ఉండగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఆదివారం నందపూర్ ఠాణా పరిధిలో పోలీసులకు చిక్కాడు. ● బొరిగుమ్మ సమితి బిసింగ్‌పూర్ ఠాణా పరిధిలో పొడపదర గ్రామానికి చెందిన తులరాం అమానత్య ఓ బాలికను అపహరించి, అత్యాచారం చేశాడు. అనంతరం పెళ్లి చేసుకుంటానని నాలుగేళ్లుగా నమ్మించాడు. అనంతరం ఈ ఏడాది ఇంటి నుంచి తరిమేశాడు. బాధితురాలు పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. తులరాంను పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. నిందితులను ఇద్దరిని సోమవారం కోర్టులో హాజరుపరిచారు.

బంగారు గొలుసుల దోపిడీ


నవరంగపూర్, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాలు చూసి తిరిగి ఇంటికి వస్తున్న కుటుంబం దోపిడీకి గురైంది. ఈ ఘటన నవరంగపూర్ జిల్లా పపదహండి ఠాణా పరిధిలో జటాబాల్ చౌక్ వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జటాబాల్ పంచాయతీ బారిగూడ గ్రామానికి చెందిన దుర్యోధన శాంతా, ఆయన భార్య సమారి, కుమార్తె అనిత, కుమారుడు ముఖేష్ శనివారం రాత్రి పపడహండిలో ఉత్సవాలు చూసి ద్విచక్ర వాహనంపై తిరిగి ఇంటికి వస్తున్నారు. ఇద్దరు దుండగలు మరో వాహనంపై వచ్చి సమారి మెడలోని రెండు బంగారు గొలుసులను తెంచుకొని పరారయ్యారు. ఈ హఠాత్పరిణామంతో ద్విచక్రవాహనంపై వెళ్తున్న కుటుంబసభ్యులు కింద పడిపోయారు. వీరికి స్వల్ప గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.



సాయి పుణ్యతిథి వేడుకలు

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణ సమీపంలోని వైకేఎం కాలనీ సాయి మందిరంలో బాబా 106వ పుణ్యతిథి వేడుకలు నిర్వహించారు. బాబా సమాధిలోకి దసరా రోజు వెళ్లిన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు అర్చకులు విజయ లక్ష్మి తెలిపారు. సమాధిని పూలు, సుగంధాలతో అలంకరించి ప్రార్థనలు చేశారు. ఉదయం, సాయంత్రం సేవకులు నగర సంకీర్తన చేపట్టారు.

పద్మనాభసాగరాన్ని పట్టించుకోరా..!



కొత్తూరు మండలంలోని బలద పద్మనాభ సాగరం పూడిక, పనికిరాని మొక్కలతో నిండిపోయింది. దీంతో వందెకరాల సాగరం చిన్నబోయింది. మరికొంత ఆక్రమణలతో చిక్కిపోయింది. 1,200 ఎకరాలకు సాగునీరు అందించే సాగరంపై పచ్చటి నిర్లక్ష్యం అలముకుంది. రైతులకు సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. సాగరాన్ని మెరుగుపరిచి సాగునీటి ఇబ్బందులు తీర్చాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై నీటిపారుదల శాఖ ఏఈ కృష్ణప్రసాద్ స్పందిస్తూ పద్మనాభసాగరాన్ని మెరుగుపరిచేందుకు తగిన చర్యలు చేపడతామన్నారు. –న్యూస్‌టుడే, కొత్తూరు



ఆత్మీయ కలయిక

జియ్యమ్మవలస మండలంలోని పెదమేరంగి జడ్పీ పాఠశాలలో 2012-13లో పదో తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా పాఠశాలకు చేరుకొని ఆనందంగా గడిపారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సత్కరించారు. – న్యూస్‌టుడే, జియ్యమ్మవలస

కూరగాయల ధరలు తగ్గించాలని నిరసన

కొమరాడ, న్యూస్‌టుడే: నిత్యావసరాల ధరలు తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం కొమరాడలో ప్రజలతో కలిసి నిరసన తెలిపారు. కూరగాయల ధరల పెరగడంతో సామాన్యులపై ఆర్థిక భారం పడుతోందన్నారు.

ఒరిగిన ఆర్టీసీ బస్సు



పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: విజయదశమి పండగ రోజున ఆర్టీసీ బస్సుకు చోదకుడి చాకచక్యంతో పెనుప్రమాదం తప్పింది. పాలకొండ ఆర్టీసీ సముదాయానికి రాజాం నుంచి వస్తున్న బస్సు శనివారం రాత్రి ఎదురుగా వస్తున్న వాహనానికి దారి ఇచ్చే క్రమంలో పక్కన ఉన్న గుంతలో ఇరుక్కుపోయింది. చోదకుడు బస్సు పడిపోకుండా పక్కకు నిలుపుదల చేయడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. రహదారి ఇరుగ్గా ఉండటం, రాత్రి సమయం కావడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. ఆదివారం డీఎం పి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది బస్సును బయటకు తీశారు.

శభాష్ ముదిత



గరుగుబిల్లికి చెందిన వి.వి.ఎస్.ఆర్. ముదిత కోవిద తగరపువలసలోని ఓ ఇంజినీరింగు కళాశాలలో ఈసీఈ ఆఖరి సంవత్సరం చదువుతోంది. తోటి విద్యార్థులతో కలిసి డ్రోన్ తయారు చేశారు. దసరా సెలవులకు స్నేహితులతో కలిసి ఇంటికి వచ్చిన ఆమె సొంత పొలంలో ప్రయోగాత్మకంగా క్రిమిసంహారక మందు పిచికారీ చేశారు. ఎకరా పొలానికి 6 నిమిషాల్లో మందు కొట్టినట్లు విద్యార్థులు ఫణి, రవితేజ, ప్రియాంక, ముదిత తెలిపారు. కూలీల ఖర్చు, సమయం ఆదా అవుతుందన్నారు. రైతులంతా డ్రోన్‌లను వినియోగించాలని సూచించారు. – న్యూస్‌టుడే, గరుగుబిల్లి

అనుమానంతో భార్యను నరికి చంపిన భర్త

హుకుంపేట, న్యూస్‌టుడే: అనుమానంతో భార్యను భర్త నరికి చంపిన ఘటన ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. మండలంలోని మఠం పంచాయతీ గన్నేరుపుట్టు గ్రామంలో ఒడిశా రాష్ట్రంలోని నందాపూర్ గ్రామం నుంచి భర్త కిమ్ముడు పనో, అతని భార్య లబ్బ రెండేళ్ల క్రితం గన్నేరుపుట్టు వచ్చి అక్కడే కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నారు. భార్య వివాహేతర సంబంధం పెట్టుకొందని అనుమానంతో భర్త ఆదివారం ఆమెను నరికి చంపి కొండపైకి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కొండపైకి వెళ్లి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

నివాళులు..

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య సమరయోధుడు స్వర్గీయ గొర్లెపాటి బుచ్చప్పరావు సేవలు చిరస్మరణీయమని వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కర్రి ప్రసాదురావు అన్నారు. ఆదివారం బుచ్చప్పరావు 111 జయంతి పురస్కరించుకొని నివాళులు అర్పించారు. నేటి రాజకీయాల్లో యువతకు బుచ్చప్పరావు ఎంతో ఆదర్శవంతులని కొనియాడారు.

పెరటి తోటలతో పోషకాలు

అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, వసతి గృహాల పరిధిలో పెరటి తోటల పెంపకంతో పిల్లలకు మంచి పోషకాహారం లభిస్తుందని అధికారులు, వైద్యులు చెబుతున్నారు. పార్వతీపురం నియోజకవర్గంలో కొన్ని గ్రామాల్లో ఈ పథకం అమలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. సంబంధిత శాఖ నుంచి వచ్చిన విత్తనాలతో తోటలు పెంచి పిల్లలకు, గర్భిణులకు పోషకాహారం అందజేస్తున్నారు.

– న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం, బలిజిపేట గ్రామీణం



అరసాడలో వంగ, అరటి తోటలు

పార్వతీపురం మండలంలోని పెదబొండపల్లి కేంద్రంలో కార్యకర్త అలివేణి బీర, బెండ, ఆనప, వంగ, ఆకుకూరలు పెంచుతున్నారు. బాలగుడబ, అడ్డాపుశీల, కొత్తఊరు, గంగాపురం, ములగ, రావికోనలో తోటలు పెరుగుతున్నాయి. బలిజిపేట మండలంలోని అరసాడలో మూడు అంగన్‌వాడీ కేంద్రాలు ఒకచోటే ఉన్నాయి. వీరికి స్థలం ఉండటంతో అన్ని రకాల కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్నారు. కొన్నిసార్లు పక్కనున్న పాఠశాలకు ఇస్తున్నారు. మిర్తివలస, నారన్నాయుడువలసలో ఈ విధానం అమలు చేస్తున్నారు.



పెదబొండపల్లిలో కూరగాయలు కోస్తున్న కార్యకర్త

ప్రోత్సాహం అందిస్తున్నాం..

పక్కా భవనాలు ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో పెరటి తోటల పెంపకానికి శాఖ పరంగా కార్యకర్తలకు ప్రోత్సాహం అందిస్తున్నాం. బాగా సేద్యం చేస్తున్న కార్యకర్తలకు ఉత్తమ పురస్కారాలతో సత్కరిస్తున్నాం.

– శ్రీనివాసరావు, పీవో, ఐసీడీఎస్ ప్రాజెక్టు, పార్వతీపురం

హలో.. ఏ కొండమీద ఉన్నావ్!

రేషన్ సరకులు కావాలంటే కొండ దిగాలి..

ఏదైనా పథకానికి వేలిముద్ర వేయాలంటే చెట్టు కిందకి చేరాలి..

సమాచారం అందించాలంటే కాలినడకన వెళ్లాలి..

మన్యంలోని పలు గ్రామాల్లో మొన్నటి వరకు ఎదురైన సమస్యలివి. కొండలపై ఉన్న గ్రామాల్లో సంకేతాలు సక్రమంగా అందక గిరిజన ప్రజలు ఏళ్లుగా అనేక ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికీ చరవాణి ముఖం చూడని గ్రామాలు ఇంకా ఉన్నాయి. వీటిని దృష్టిలో ఉంచుకొని కేంద్రం అన్నిచోట్లా సంకేతాల వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు టవర్లు ఏర్పాటు చేస్తోంది. ఇప్పటికే చాలా చోట్ల పనులు పూర్తి కాగా.. ఇప్పుడు మిగిలిన గ్రామాల్లోనూ అందుబాటులోకి తీసుకురానుంది.

న్యూస్‌టుడే, పార్వతీపురం, సీతంపేట

ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 2,305 చోట్ల కొత్తగా 4జీ నెట్‌వర్క్‌తో చరవాణి టవర్లు ఏర్పాటు చేయనుంది. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో 236 నిర్మించనున్నారు. ఈ నేపథ్యంలో గిరిజన ప్రాంతాలున్న జిల్లాకు ఎక్కువ మేలు జరగనుంది.

పార్వతీపురం మన్యంను నీతి ఆయోగ్ ఆకాంక్షిత జిల్లాగా గుర్తించింది. దీంతో జిల్లాలో 83 చరవాణి టవర్ల ఏర్పాటుకు మంజూరు వచ్చింది. కురుపాం, గుమ్మలక్ష్మీపురం, సీతంపేట, సాలూరు మండలాల్లో స్థలాలు గుర్తించి టవర్లు ఏర్పాటు చేశారు. దీంతో ఆయా పరిసర గ్రామాల్లో సంకేతాల వ్యవస్థ మెరుగుపడింది. ఒకప్పుడు గుమ్మలక్ష్మీపురం మండలంలోని గొయిపాకకు వెళ్లేందుకే ఒక రోజు పట్టేది. ఇప్పుడు చిటికెలో సమాచారం వెళ్తోంది. మరో 25 రానున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇవన్నీ కొండ శిఖర ప్రాంతాల్లోనే ఏర్పాటు చేయడంతో ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.



గుమ్మలక్ష్మీపురం లోవముఠా ప్రాంతంలో ఏర్పాటు చేసిన టవర్

- మన్యంలో 83 చరవాణి టవర్ల ఏర్పాటు
- వంద శాతం గ్రామాలకు సంకేతాలే లక్ష్యం

ఎన్నో ప్రయోజనాలు

★ గతంలో రేషన్ సరకుల కోసం సంకేతాలు అందే ప్రాంతాలకు ప్రజలు వచ్చేవారు. కొండలపైనున్న గ్రామాల నుంచి మైదాన ప్రాంతాలకు కాలినడకన చేరుకునేవారు. సిగ్నళ్లు సక్రమంగా లేక మన్యంలోని పలు గ్రామాలకు నెలల తరబడి బియ్యం ఇవ్వడం లేదన్న ఫిర్యాదులు వచ్చాయి.

★ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే ఆహారానికి సంబంధించి లబ్ధిదారుల వివరాలు, ఫొటోలు, ఇతర సమాచారం రోజూ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ప్రస్తుతం మన్యంలోని చాలా గ్రామాల్లో ఈ వివరాలు ఆఫ్‌లైన్లో నమోదు చేస్తున్నారు. దీంతో పర్యవేక్షణ కొరవడుతోంది.

★ మహిళా సంఘాల దైనందిన కార్యక్రమాలు, బ్యాంకు రుణాలు పొందడం, చెల్లింపులు తదితరాలు సక్రమంగా జరగాలంటే సంకేతాలు అందుబాటులోకి రావాలి.



సీతంపేట మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు సంకేతాల కోసం ఇలా కొసంగి కూడలికి రావాల్సిన పరిస్థితి గతంలో ఉండేది. (పాతచిత్రం)

విస్తృతం చేస్తున్నాం

జిల్లాలో విస్తృతంగా చరవాణి టవర్లు ఏర్పాటు చేస్తున్నాం. రానున్న కొన్ని రోజుల్లో వంద శాతం గ్రామాల్లో సిగ్నల్ వ్యవస్థ అందుబాటులోకి రానుంది. దీంతో గిరిజనులు అందరూ సేవలు వినియోగించుకునే అవకాశం కలుగుతుంది.

– ఎ.శ్యామ్‌ప్రసాద్, పాలనాధికారి, పార్వతీపురం

మార్కెట్ కమిటీలపై నిఘా నేత్రం

న్యూస్‌టుడే, బొబ్బిలి

ఆదాయం మెరుగుకు విజిలెన్స్ కమిటీలు

ఉమ్మడి జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీల ఆదాయం మెరుగుకు ప్రభుత్వం విజిలెన్సు కమిటీలు ఏర్పాటు చేసింది. చెక్‌పోస్టుల వద్ద వాహనాలను ఆపి రవాణా అవుతున్న వ్యవసాయ ఉత్పత్తులపై రెండు శాతం పన్ను వసూలు చేసి రసీదులు అందజేయాలి. కొన్నిచోట్ల ఇది పక్కాగా జరగడం లేదు. అక్కడి సిబ్బంది చేతివాటం చూపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీనికి అడ్డుకట్ట వేసేందుకు ఉన్నతాధికారులు విజిలెన్సు కమిటీలు ఏర్పాటు చేశారు. ఈ నెల నుంచే ఆకస్మిక సోదాలు నిర్వహించి ప్రభుత్వానికి నివేదికలు పంపనున్నారు.



బొబ్బిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

సభ్యులు వీరే

★ విజయనగరం జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి నేతృత్వంలో కార్యదర్శుల హోదాలో పనిచేస్తున్న జి.చంద్రమౌళి, ఆర్.సతీష్, ఆర్.విజయబాబు, కె.ఈశ్వరరావు కమిటీ సభ్యులుగా నియమితులయ్యారు.

★ మన్యం జిల్లాలో జిల్లా మార్కెటింగ్ ఇన్‌ఛార్జి అధికారి జీఆర్ రావు ఆధ్వర్యంలో కార్యదర్శులు వి.సతీష్‌కుమార్, వి.ఆర్.వి.ఎస్ ధీరజ్‌రాజు, టి.అనిల్ ప్రసాద్, నరేష్‌కుమార్ నియమితులయ్యారు.

★ వీరు ఉమ్మడి జిల్లాలోని 13 కమిటీల పరిధిలో చెక్‌పోస్టుల సందర్శన, సెస్ వసూళ్ల తీరు, కమిటీల ఆదాయ వ్యయాలు, ఖర్చుల వివరాలపై సోదాలు చేయనున్నారు.

నిధులు పక్కదారి పట్టకుండా..

మార్కెట్ కమిటీల్లో నిధులు పక్కదారి పట్టకుండా కమిటీలు నిఘా పెడతాయి. గత ప్రభుత్వ హయాంలో కమిటీల్లో రూ.కోట్లు దుర్వినియోగమయ్యాయి. పొరుగు జిల్లాలో ఓ కమిటీ కార్యదర్శి రూ.2 కోట్లపై చిలుకు ఆయన సొంత ఖాతాకు మళ్లించుకున్నారు. ఇలాంటివి జరగకుండా విజిలెన్సు కమిటీలు పర్యవేక్షించనున్నాయి. ప్రస్తుతం పాలక వర్గాలు లేకపోవడంతో ఉద్యోగులే కీలకమయ్యారు. పన్నుల వసూళ్లు పారదర్శకంగా చేపట్టేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కమిటీలు ఏర్పాటు చేసినట్లు జిల్లా మార్కెటింగ్ అధికారి రవికృష్ణ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

- ఉమ్మడి జిల్లాలో కమిటీలు: 12
- ఏడాదికి పన్నుల లక్ష్యం: రూ.17.12 కోట్లు
- ప్రస్తుతం వసూలవుతుంది: దాదాపు రూ.12.67 కోట్లు


దస్త్రాలకు రెక్కలొచ్చాయి

న్యూస్‌టుడే, పార్వతీపురం

- ఐటీడీఏ వైద్య విభాగంలో కనిపించలేదట..
- ఓ కేసు విషయంలో వాటిని కోరిన పోలీసులు

పార్వతీపురం ఐటీడీఏ వైద్య విభాగంలో గతంలో పనిచేసిన ఓ అధికారి హయాంలో ప్రభుత్వ చెక్కులను సొంతానికి ఉపయోగించుకున్నారని విజిలెన్సు గుర్తించింది. దీనిపై పార్వతీపురం పట్టణ పోలీసు స్టేషనులో వైద్య, ఆరోగ్య శాఖ ఫిర్యాదు మేరకు ప్రభుత్వ నిధుల దుర్వినియోగానికి సంబంధించి సదరు అధికారిపై కేసు నమోదైంది. ఈ కేసుకు సంబంధించి పోలీసు అధికారులు కొన్ని వివరాలకు దస్త్రాలు కావాలని ఐటీడీఏ అధికారులను కోరారు.

కొండలపై నుంచి గర్భిణులను ఆసుపత్రులకు తీసుకువచ్చేందుకు ఐటీడీఏ పరిధిలో 2018లో పల్లకీ నిధులు ఉండేవి. అప్పటి పీవో అందులో నుంచి రూ.17.88 లక్షలు సదరు అధికారికి ఇచ్చారు. ఆ మంజూరు పత్రాన్ని దర్యాప్తు అధికారులు కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నడిచే ఏడు అంబులెన్సులకు ఇంధన వ్యయం చెల్లించేందుకు రూ.19 లక్షలు పీవో ఖాతా నుంచి ఆ అధికారికి బదిలీ కాగా.. ఆ ఆదేశాలకు సంబంధించిన పత్రాలు, నిధుల వినియోగ రసీదులు, వాహనాల వివరాలను సమర్పించాలన్నారు. అప్పట్లో పనిచేసిన ఇద్దరి అధికారుల సంతకాల స్పెసిమెన్లు అడిగారు. నిధుల విడుదలకు సంబంధించి ఐటీడీఏ కార్యాలయంలో ఉన్న రికార్డుల మేరకు వివరాలను పోలీసులకు సమర్పించినట్లు ఏపీవో ప్రసాద్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.



వైద్య ఆరోగ్య విభాగం నుంచి అంబులెన్సుల వినియోగానికి సంబంధించిన వివరాలు, వేతన చెల్లింపుల రికార్డులు, అప్పట్లో పనిచేసిన ఇద్దరు అధికారుల స్పెసిమెన్ సంతకాలను సమర్పించాల్సి ఉంది. వీటి దస్త్రాలు ప్రస్తుతం ఈ విభాగంలో అందుబాటులో లేవని తెలిసింది. రూ.36 లక్షలకు పైగా నిధుల వినియోగానికి సంబంధించి దర్యాప్తునకు అవసరమైన వివరాలు లేకపోవడంపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. విజిలెన్సు అధికారులు తమ దర్యాప్తులో భాగంగా అసలు దస్త్రాలన్నీ తీసుకువెళ్లి.. తిరిగి కార్యాలయానికి కేవలం జెరాక్స్ కాపీలే అందజేశారని సంబంధిత కార్యాలయ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటి అధికారులు అసలు పత్రాలు చూడకుండా నకళ్లను ధ్రువీకరించే పరిస్థితి లేకపోవడంతో దర్యాప్తు అధికారులకు దస్త్రాలు సమర్పించడంలో జాప్యం జరుగుతోంది. ఇటీవల కార్యాలయ సిబ్బంది పోలీసులను సంప్రదించి విజిలెన్సు అధికారుల వద్ద అసలు పత్రాలు ఉన్నట్లు తెలియజేశారు. దీనిపై ప్రస్తుత డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి వద్ద ప్రస్తావించగా.. తాను కొత్తగా బాధ్యతలు తీసుకున్నానని, వివరాలు తెలుసుకోవాల్సి ఉందన్నారు. దీనిపై సమగ్ర సమాచారం తెలుసుకుంటానని పేర్కొన్నారు.



గెలుపొందిన పాలకొండ జట్టు

క్రికెట్టు టోర్నీ విజేత పాలకొండ

పాలకొండ, న్యూస్‌టుడే: దసరా పర్వదినం సందర్భంగా నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీల్లో పాలకొండ జట్టు విజేతగా నిలిచింది. ఆదివార పాలకొండ-వీరఘట్టం జట్లు తలపడగా పాలకొండ జట్టు విజయం సాధించింది. విజేతలకు కడప ఫారెస్ట్‌రేంజ్ అధికారి టి.రాజశేఖర్, ఉద్యోగ సంఘ నాయకుడు ఎన్.భరత్‌భూషణ్‌లు బహుమతులు అందించారు.

ముగిసిన నవదుర్గ ఉత్సవాలు

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకొండ జ్ఞాన సరస్వతి ఆలయంలో గత 11 రోజులుగా నిర్వహించిన సప్తమాతృక నవదుర్గ దసరా ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజు తిరువీధి ఉత్సవం నిర్వహించి విగ్రహాలను సంకిలి నాగావళిలో నిమజ్జనం చేశారు.



ఊరేగుతున్న నవదుర్గ విగ్రహాలు

నీలగిరి పేరు.. నిబంధనలకు నీళ్లు..!

న్యూస్‌టుడే, ఎచ్చెర్ల, బలగ(శ్రీకాకుళం), రణస్థలం

పుష్ప సినిమాలో పోలీసుల కళ్లు గప్పి పాల ట్యాంకర్‌లో ఎర్రచందనం దుంగల్ని తరలించడం చూసే ఉంటారు కదా.. జిల్లాలోనూ అదే తరహాలో కొందరు అక్రమార్కులు చెలరేగుతున్నారు. అటవీ సంరక్షణ చట్టానికి తూట్లు పొడుస్తూ రూ.కోట్ల విలువైన సంపదను ఎత్తుకెళ్లిపోతున్నారు. నీలగిరి పేరు చెప్పి అకేశు కర్రను నిబంధనలకు విరుద్ధంగా ఊళ్లు దాటించేస్తున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులే వారికి అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి.



ఎచ్చెర్లలో ఓ కాటా కేంద్రం వద్ద పైన నీలగిరి, కింద అకేసు కర్రలు వేసి లోడు చేసిన లారీ

జిల్లాలో రెండేళ్ల నుంచి నీలగిరి కలపకు డిమాండ్ పెరిగింది. కాగితం, ప్లైవుడ్ తయారీకి ఎక్కువగా వినియోగిస్తారు. గతంలో మధ్యవర్తులు, వ్యాపారులు ఊరూరా తిరిగి తోటలను అధిక ధరలు కొనుగోలు చేశారు. రాజమహేంద్రవరం, భద్రాచలం, రాయగడలోని పేపర్ మిల్లులకు రవాణా జరిగేది. కాలక్రమేణా నీలగిరి కర్రల ఉత్పత్తి తగ్గిపోయింది. అయినా డిమాండ్‌ను అదునుగా చేసుకొని కొందరు అక్రమానికి తెరలేపారు. అటవీ సంపదకు చెందిన అకేశు కర్రను నీలగిరితో కలిపి తరలించేస్తూ జేబులు నింపుకొంటున్నారు.


దందా జరుగుతోందిలా..

- గార మండలంలోని మొగదాలపాడు, ఎచ్చెర్లలోని షేర్‌మహ్మద్‌పురం కొండ, కుప్పిలి, రణస్థలంలోని పాతర్లపల్లి, కోష్ట, పొందూరుతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో స్థానిక రైతుల నుంచి మధ్యవర్తులు అకేశు కర్రను కొనుగోలు చేస్తారు.
- వాటిని వాహనాల బరువు తూచే కాటా కేంద్రాలు వద్దకు తీసుకొస్తారు.
- అక్కడ లారీల్లో కింద భాగంలో అకేశు కర్ర వేసి.. పైన నీలగిరి కర్రల లోడు కనిపించేలా సర్దుతారు.
- రెండు కర్రలు పైన తొక్కు తీసేస్తే చూడటానికి ఒకేలా ఉంటాయి. అందుకే కాటాల వద్దే తొక్కు తీసి రెండింటినీ కలిపి లోడు చేస్తున్నారు.

పెద్ద ఎత్తున్న తరలిపోతున్న రూ.కోట్ల విలువైన అకేశు కర్ర

అక్రమార్కులకు కొమ్ముకాస్తున్న అటవీశాఖ సిబ్బంది

పక్కా ప్రణాళికతో ముందుకు..



రాత్రి సమయంలో పేపర్ మిల్లు వద్ద సరకు అన్‌లోడ్ చేసిన పత్రం

కాటాల నిర్వాహకులు, మధ్యవర్తులు కుమ్మక్కై ఈ అక్రమ రవాణా ద్వారా రూ.కోట్లు దోచుకుంటున్నారు. అసలు నీలగిరి సాగు చేయని రైతుల పాసు పుస్తకాలు చూపిస్తూ.. వారి నుంచే కొనుగోలు చేసినట్లు బిల్లులు సృష్టిస్తున్నారు. సరకు కాగితపు మిల్లుకు వెళ్లే వరకు వ్యవహారం అంతా కాటా నిర్వాహకులే చూసుకుంటారు. ప్రణాళిక ప్రకారం సరకు పేపర్ మిల్లుకు రాత్రి సమయంలో పంపి.. ఆ సమయంలో అక్కడ అన్‌లోడ్ చేస్తారు. జిల్లాలో ఎక్కువ శాతం కాటా కేంద్రాలు ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఉన్నాయి. ఎచ్చెర్ల, పొందూరు, లావేరు మండలాల్లోని కేంద్రాల నుంచే ఇతర ప్రాంతాలకు అక్రమ రవాణా జరుగుతోంది.

పట్టించుకోని యంత్రాంగం..

దళారులు రైతుల నీలగిరి టన్ను రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు కొనుగోలు చేస్తున్నారు. దాన్ని కాగితపు పరిశ్రమకు రూ.14 వేల నుంచి రూ.16 వేల వరకు అమ్ముతున్నారు. ఒక లారీలో 20 నుంచి 30 టన్నుల కలప రవాణా చేయొచ్చు. దాని విలువ సుమారు రూ.1.5 లక్షలు ఉంటుంది. ఒక్క ఎచ్చెర్ల నియోజకవర్గంలోని కాటా కేంద్రాల నుంచే రోజుకు 30 వరకు లారీల్లో ఆకేశు కర్ర తరలిపోతుంది. ఇలా రోజుకు రూ.1.3 కోట్ల అటవీ సంపద తరలిపోతోంది. ఇంత జరుగుతున్నా అటవీశాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చర్యలు తీసుకుంటాం..

జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు కలప అక్రమ రవాణాకు పాల్పడుతున్నవారికి రూ.6 లక్షలు వరకు అపరాధ రుసుం విధించాం. ఆకేశు కర్రను తరలిస్తున్న విషయం మా దృష్టికి రాలేదు. క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తాం. అక్రమంగా రవాణా చేస్తే ఎవరైనా ఉపేక్షించేది లేదు. కఠిన చర్యలు తీసుకుంటాం. – ఎస్.వెంకటేశ్, జిల్లా అటవీశాఖాధికారి